సప్తవర్ణ శోభితం శ్రీవారి పుష్పయాగం

వార్త 8లో

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 31 అక్టోబరు 2025 8 పేజీలు

పకడ్బందీగా రీ సర్వే చేపట్టాలి

– జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

విశాలాంధ్ర –చిత్తూరు: భూముల రీ సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి, ఆర్డిఓ లతో, ఎమ్మార్వోలతో, సర్వే అధికారులతో, రెండో విడత, మూడో విడత రీ సర్వే పనులు సమీక్షించారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వె మూడో విడత పారదర్శకంగా నిర్వహించాలి, మూడో విడత సర్వే కార్యక్రమాలలో అమలలో సుమోటో కరెక్షన్ నవంబర్ 10వ తేదీ లోపల పూర్తిచేయాలని ఆదేశించారు భూమి రికార్డులలో సవరణలు పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు సహా భూమికి సంబంధించిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో విఆర్ ఓలు, విలేజ్ సెక్రెటరీల నుండి ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల మేరకునాణ్యతతో కూడినపరిష్కారం చూపాలన్నారు.తాహసిల్దార్లు ఎక్స్టెన్షన్ వేరియేషన్ బౌండరీ వేరియేషన్ జాయింట్ ఎల్పీఎం కరెక్షన్లకు సంబంధించి ఎక్కువ ఫిర్యాదులు వస్తాయని ఇందుకు సర్వే శాఖతో సమన్వయం చేసుకొని పరిష్కరించాలని తెలిపారు. మొదటి విడత పైలట్ ప్రాజెక్టు కింద 31 గ్రామాలలో 30,774 ఎకరాలు భూమిని సర్వే చేయడం జరిగిందని తెలిపారు. రెండో విడత రీసెర్వె కార్యక్రమం అమలులో భాగంగా నగిరి, చిత్తూరు, పలమనేరు నియోజకవర్గం వర్గాలలో 38 గ్రామాలు రి సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. సుమారు 40,359 ఎకరాల భూమిని రి సర్వే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మూడో విడత రీ సర్వే కార్యక్రమాలలో భాగంగా 12 గ్రామాలలో 3,859 ఎకరాల భూమిని రీసెర్వె కార్యక్రమం నిర్వహించుచున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే డిడి జయరాజు, ఏడి ఇన్చార్జి పి ఎస్ శాంతిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధన అవకాశాలను సద్వినియోగం చేసుకొని..

దేశాభివృద్ధికి తోడ్పడాలి

నేషనల్ అట్మాస్పిరిక్ రీసెర్చ్ లాబొరేటరీ ను సందర్శించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర –తిరుపతి కలెక్టరేట్: దేశంలో వాతావరణ, అంతరిక్ష పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడంలో పరిశోధన, సాంకేతిక అభివృద్ధి ప్రధాన పాత్ర పోషి స్తాయని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటే శ్వర్ అన్నారు. రీసెర్చ్ స్కాలర్లు, పోస్ట్‌డా క్టరల్ పరిశోధకులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు. గదాంకి సమీపంలోని జాతీయ వాయు మండలీయ పరిశోధన ప్రయోగశాల (ఎన్ఏఆర్ఎల్)లో అక్టోబర్ 27 నుండి నవంబర్ 2 వరకు జరుగుతున్న "విజిలెన్స్ అవగాహన వీక్" కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కార్యాలయ పనుల్లో పారదర్శకత, నిబద్ధత, బాధ్యతాయుతమైన విధానం అవసరమని పేర్కొన్నారు. వాతావరణ అంచనాలు, తుఫానులు, పిడుగులు, తీవ్రమైన వాతావరణ పరిస్థితులపై ఎన్ఏఆర్ఎల్ లో జరుగుతున్న పరిశోధనలు సామాజిక ప్రయోజనాలకు ఎంతగానో దోహదపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. తరువాత జిల్లా కలెక్టర్ ఎన్ఏఆర్ఎల్ లోని ప్రధాన ప్రయోగాత్మక, గణన సదుపాయాలను సందర్శించి, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ (ఎచ్పిసి) వ్యవస్థను పరిశీలించారు. వాతావరణ అంచనాల పరిశోధన ఫలితాలు

2లో

మేయర్ దంపతుల హత్య కేసు తీర్పు..

మరోసారి వాయిదా

విశాలాంధ్ర – చిత్తూరు: రాష్ట్రంలో సంచలం సృష్టించిన చిత్తూరు మాజీ మేయర్ అనురాధ ఆమె భర్త కటారి మోహన్‌ల హత్య కేసు తీర్పును శుక్ర వారానికి న్యాయస్థానం వాయిదా వేసింది . ఈ కేసులోఐదు మంది నిందితుల పై నేరం రుజువైందని చిత్తూరు కోర్టు నిర్ధారించిన సంగతి తెలిసిందే.ఈ కేసుకు సంబంధించి

2లో

ఉచిత ఇసుక విధానం పటిష్టం

కొత్త రీచులకు ఆమోదం, స్టాక్‌యార్డుల ఏర్పాటు

2లో

పాకాలలో చోరీ...

- ఇంటి కిటికీ ఇనుప చువ్వలు కోసి పది లక్షల రూపాయల విలువచేసే బంగారు నగలను ఎత్తుకెళ్లిన దొంగలు

2లో

దేశాభివృద్ధికి తోడ్పడాలి

(మొదటి పేజీ తరువాయి) తిరుపతి జిల్లా వ్యవసాయాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మొంథా తుఫాన్ సమయంలో నష్టం తక్కువగా జరగడం వెనుక ఇటువంటి పరిశోధనా కేంద్రాల సమాచారం కీలకమని అన్నారు. రీసెర్చ్ స్కాలర్లతో మాట్లాడుతూ, పరిశోధన రంగంలో ఆసక్తి పెంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం వాతావరణ పరిశోధన, రాడార్ వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏఆర్ఎల్ డైరెక్టర్ డా.అమిత్‌కుమార్ పాత్రో, విజిలెన్స్ అధికారి రఘునాథ్, కమిటీ చైర్మన్ డా.చైతన్య జైన్, ఏవో మల్లిక మాధురి, ఎన్ఏఆర్ఎల్ రీసెర్చ్ స్కాలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరోసారి వాయిదా

(మొదటి పేజీ తరువాయి) గురువారం సాయంత్రం వరకు కోర్టులో వాదనలు కొనసాగాయి, దీంతో న్యాయ మూర్తి తుది తీర్పును శుక్రవారం ప్రకటిస్తామని తెలిపారు. అంతవరకు నిందితులను జుడిషియల్ కస్టడీలో ఉంచాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసు కోకుండా చిత్తూరు కోర్టు వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 2015 నవంబర్ 17వ తేదీన చిత్తూర్ నగర్ పాలక కార్యాలయంలో అప్పటి మేయర్ కటారి అనురాధ ను తుపాకీతో కాల్చి హత్య చేయగా, ఆమె భర్త కటారి మోహన్ ను నరికి హతమార్చారు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఈ కేసులో 21 మందిని నిందితులగా పోలీసులు గుర్తించారు. ఈకేసు సంబంధించి 122 మంది సాక్షలను విచారించారు. ఈ హత్యా ఘటనలో నిందితులుగా ఉన్న ఐదు మందిపై నేరం రుజువైనట్లు ఇదివరకే కోర్టు పేర్కొంది. వీరికి శిక్ష ఖరారు చేయన్నట్లు న్యాయమూర్తి ఇది వరకే ప్రకటించిన నేపథ్యంలో మరో మారు కేసు వాయిదా వేయడంతో నిందితులకు ఎలాంటి శిక్ష విధిస్తారో అన్న అంశంపై తీవ్ర ఉత్కంఠత నెలకొంది.

పాకాలలో చోరీ....

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలంలో గురువారం మధ్యాహ్నం పట్టపగలే చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు కిటికీ ఇనుప చువ్వలు కోసి ఇంట్లోకి ప్రవేశించి సుమారు పది లక్షల రూపాయల విలువచేసే 64 గ్రాముల బంగారు నగల ను దోచుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి బాధితు రాలి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి . పాకాల మండలం ఆదినపల్లె గ్రామపంచాయతీ శంఖంపల్లిలో పూతలపట్టు ు నాయుడుపేట జాతీయ రహదారి ప్రక్కనే నివాసం ఉంటున్న లేట్ శంకర్ నాయుడు భార్య వసంతమ్మ అనారోగ్య కారణంతో గురువారం ఉదయం తిరుపతి హాస్పిటల్ కు వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన దొంగలు మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో ఇంటికి అమర్చి ఉన్న కిటికీ ఇనుప చువ్వలను కోసి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉంచిన సుమారు పది లక్షల రూపాయల విలువచేసే 64 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. హాస్పిటల్ నుండి తిరిగివచ్చిన వసంతమ్మ చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పాకాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది . చోరీ సమాచారం అందడంతో ఎస్సై హరీష్ కుమార్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై ఎస్సై హరీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైనిక్ స్కూళ్లలో ప్రవేశ పరీక్ష
దరఖాస్తుల గడువు 9 నవంబర్ వరకు పొడిగింపు

విశాలాంధ్ర - తిరుపతి : 2026-27 విద్యా సంవత్సరానికి సైనిక్ స్కూళ్లలో 6వ తరగతి మరియు 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించబడే ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల సమర్పణ గడువును 9 నవంబర్ 2025 వరకు పొడిగించారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ యన్. విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ప్రవేశ పరీక్ష ద్వారా దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనీ సైనిక్ స్కూళ్లలో చదువుకునే అపూర్వ అవకాశాన్ని విద్యార్థులు పొందవచ్చని ఆయన అన్నారు. వయస్సును బట్టి 4వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న బాల, బాలికలకు ఈ పరీక్షకు అర్హత ఉందని వివరించారు.జాతీయ స్థాయిలో నిర్వహించబడే ఈ ప్రవేశ పరీక్ష 18 జనవరి 2026 న జరుగనుంది. దరఖాస్తు విధానం, అర్హతలు మరియు పరీక్షా విధానం గురించి పూర్తి వివరాలను తెలుసుకోవడానికి విద్యార్థులు మరియు తల్లిదండ్రులు 86888 88802 లేదా 93999 76999 నంబర్లను సంప్రదించవచ్చని, అదేవిధంగా లితిరుపతి వరదరాజ నగర్‌లోని “విశ్వం సైనిక్ - నవోదయ పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం” లిను కూడా సంప్రదించవచ్చని డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు.

ఉచిత ఇసుక విధానం పటిష్టం

విశాలాంధ్ర -తిరుపతి కలెక్టరేట్: జిల్లాలో ఉచిత ఇసుక విధానాన్ని మరింత బలంగా అమలు చేయడానికి కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ చైర్మన్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధ్యక్షతన గురువారం జిల్లా ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు పై ఆమోదం తెలిపారు. కమిటీ సభ్యులు వివిధ ఇసుక రీచులు, స్టాక్‌యార్డులు, అనుమతుల గడువు పొడిగింపులపై సమగ్రంగా సమీక్షించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.నాగలాపురం మండలం, కారిణి గ్రామం సర్వే నంబర్ 162/2లో శ్రీ ఓ.పి. విష్ణువర్ధన్ రెడ్డి భూమి నుండి 73,500 మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వి సరఫరాకు చట్టబద్ధ అనుమతులు లభించడంతో కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే నాగలాపురం మండలం, బైటకోడియంబేడు గ్రామం సర్వే నంబర్లు 282/1, 4లో మార్క్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు 28,050 మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వి సరఫరాకు పర్యావరణ అనుమతులు, సూళ్లూరుపేట మండలం, మంగనెల్లూరు నాగభూషణమ్మ భూమిలో 26,953 మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వి సరఫరా చేయుటకు కమిటీ సంయుక్త తనిఖీ నివేదిక ఆధారంగా ఆమోదం. నాగలాపురం మండలం, కారిణి గ్రామం సర్వే నంబర్లు 159/1ఏ, 160/2, 3ఏ, 3బి, 5బి లలో కడలి గోపాలరావు పట్టా భూమిలో ఇసుక త్రవ్వి సరఫరా చేయుటకు. పిచ్చాటూరు మండలం, సురుటుపల్లి ఆనకట్ట (అరణియార్ నది) ఎస్ఎస్బి పేట గ్రామంలో 99,000 మెట్రిక్ టన్నుల ఇసుక త్రవ్వి సరఫరాకు. పాలచూరు ఆనకట్ట యూ/ఎస్, డిఎస్ గుడాలి ప్రాంతాలు, గతంలో మంజూరైన ఇసుక త్రవ్వక అనుమతులు 31-08-2025 నాటికి గడువు ముగియడంతో మిగిలిన ఇసుక సరఫరా చేయుటకు గడువును 31-03-2026 వరకు పొడిగించాలని నిర్ణయించింది. స్టాక్‌యార్డుల ఏర్పాటు, గూడూరు నియోజకవర్గం, చంద్రగిరి నియోజకవర్గం భాకరాపేట ప్రాంతం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, గూడూరు, భాకరాపేట ప్రాంతాలలో ఇసుక స్టాక్‌యార్డులు ఏర్పాటు చేయడానికి కమిటీ ఆమోదం తెలిపింది.

వైభవోపేతం...

శ్రీ కల్యాణ వెంకన్న పుష్పయాగం..!

- వివిధ రకాల పుష్ప, పత్రాలతో స్వామికి నివేదన
- ఊరేగింపుగా తీసుకువచ్చిన చెవిరెడ్డి కుటుంబీకులు
- శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్లకు జరిగిన పుష్పయాగం

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : పరమ పవిత్రమైన కార్తీక మాసంలో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం సాయంత్రం పుష్ప యాగ మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. పరిమళ భరిత సువాసనలు వెదజల్లే 14 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగు రంగుల పుష్పాలు, పత్రాల మధ్యన కొలువుదీరిన స్వామి, అమ్మవార్ల వైభవం భక్తులకు కనువిందు చేసింది. గత నెలలో నిర్వహించిన వార్షిక బ్రహ్మోత్సవాల్లో అర్చకులు, ఉద్యోగులు, భక్తుల వల్ల తెలియక జరిగిన తప్పులు, దోషాల నివారణకై ఆలయంలో పుష్ప యాగం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలోని%వా% కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి పుష్ప యాగ మహోత్సవంను కన్నుల పండువుగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్ర స్వర్ణాభరణాలతో అందంగా అలంకరించి వేద మంత్రాల నడుమ పుష్ప కైంకర్యం చేశారు. చామంతి, వృక్షి, సంపంగి, సెంటు జాజులు, పొగడ, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలి రేకులు వంటి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ తదితర పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించి స్వామి, అమ్మవార్లకు సాంత్వన కలిగింప చేశారు. ఆలయ అర్చక స్వాములు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో 20 సార్లు స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఉత్సవమూర్తులకు నిండుగా పుష్ప, పత్రాలతో ముంచెత్తి నివేదన చేపట్టారు. ఆ తరువాత ఆలయ మాడ వీధులలో ఊరేగింపుగా బయలుదేరిన స్వామి, అమ్మవార్లు భక్తులను అనుగ్రహించారు. ఈ పుష్పయాగంకు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి రక, రకాల పుష్పాలు, పత్రాలను తీసుకు వచ్చి యాగానికి వినియోగించారు. కల్యాణ వెంకన్న పుష్పయాగ మహోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఊరేగింపుగా తీసుకువచ్చిన చెవిరెడ్డి కుటుంబీకులుశ్రీ కల్యాణ వెంకన్న ఆలయంలో జరిగే పుష్ప యాగానికి వినియోగించే వివిధ రకాల పుష్ప, పత్రాలను ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబీకులు గ్రామస్తులతో కలసి ఊరేగింపుగా తీసుకువచ్చారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డిలక్ష్మీ, సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి, మంజుల దంపతులతో పాటు గ్రామపెద్దలు, ఆలయ అధికారులు, సిబ్బంది పుష్పాలు, పత్రాలను గ్రామంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చి స్వామి, అమ్మ వార్లకు నివేదించారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి ప్రత్యేకపూజలు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణా మూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కుటుంబాలను ఆదుకోండి

- దేవాంగ సంఘం నేత పులి రామచంద్ర

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: మొంథా తుఫాను కారణంగా నిరాశ్రయులైన చేనేత కుటుంబాలను ఆదుకోవాలని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షులు పులి రామచంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొంథా తుఫాను నేపథ్యంలో కూటమి ప్రభు త్వం చేసిన సేవలు ఎంతో అమోఘమన్నారు. ఎటువంటి ప్రాణన ష్టం జరగకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ముందు జాగ్రత్తలు ఎంతో అభినందించ విషయమన్నారు. తుఫాను బాధితులకు ప్రకటించిన 25 కేజీల బియ్యం, రూ.3వేలు నగదు. నిత్యవసర వస్తువులు తక్షణం అందించడం హర్షణీయమ న్నారు. ఇందుకు దేవాంగ సంఘం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు ఆయన తెలిపారు. ఇక మొంథా తుఫానుతో చేనేత కార్మికులు మగ్గం గుంటల్లోకి నీళ్లు వచ్చి, పడుగులు చేసుకునే పందిర్లు గాలికి విరిగిపడిపోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. తుఫానుతో ఉపాధి కోల్పోయిన చేనేత కుటుంబాల వారికి చేనేత దినోత్సవం రోజు ప్రకటించినటువంటి నేతన్న భరోసా రూ.25 వేలు తక్షణం అందజేసి ఆదుకోవాలని పులి రామచంద్ర విన్నవించారు.

శ్రీ కపిలేశ్వరాలయంలో ఘనంగా ఛండీ హెూమం ప్రారంభం

విశాలాంధ్ర -తిరుపతి: తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఛండీ హెూమం గురువారం ఘనంగా ప్రారంభమైంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేషపూజ, హెూమ మహెూత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా అక్టోబరు 30 నుండి నవంబరు 07వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు శ్రీ కామాక్షి అమ్మవారి హెూమం (చండీయాగం) వైభవంగా జరుగనుంది.

ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

– నియోజకవర్గ కార్యదర్శి కె. నారాయణ పిలుపు

విశాలాంధ్ర - గూడూరు : ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి కె. నారాయణ పిలుపునిచ్చారు. గురువారం గూడూరు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31న నిర్వహించే ఆవిర్భావ దినోత్సవానికి ఆటో యూనియన్, ముఠా వర్కర్స్, మున్సిపల్, మెడికల్, భవన నిర్మాణ కార్మికులు హాజరై జండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన పోరాడే ఏకైక యూనియన్ ఏఐటీయూసీ అన్నారు. బీజేపీ ప్రభుత్వం 44 లేబర్ కోడ్‌లను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం ఏఐవైఎఫ్ సీనియర్ నాయకులు వై.సునీల్ మాట్లాడుతూ దేశంలోనే తొలి ట్రేడ్ యూనియన్ ఏఐటీయూసీ అన్నారు. యూనియన్ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో , ఇన్సాఫ్ నాయకులు షేక్ జమాలుల్లా, షేక్ ఇలియాజ్ (మున్నా) తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బోరుకు మరమ్మతులు చేయించండి

– ఈశ్వరయ్య గిరిజన కాలనీ వాసుల వేడుకోలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విద్యుత్ బోరుకు మరమ్మతులు చేయించాలని శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్య గిరిజన కాలనీ వాసులు వేడుకుంటున్నారు. ఈ కాలనీలో సుమారు మూడు వారాల కిందట విద్యుత్ బోరు మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి ఈ కాలనీ వాసులు తాగునీటి కోసం తిప్పలు పడుతున్నారు. పక్క కాలనీలోకి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ బోరుకు మరమ్మతులు చేయాలని విద్యుత్ అధికారులకు స్థానికులు నిత్యం విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు. అయితే వారు మరమ్మతులు చేయడానికి అంగీకరించడం లేదు. విద్యుత్ బోరుకు అనధికారికంగా కనెక్షను ఇచ్చారని అలాంటపుడు తాము మరమ్మతులు చేయలేమని వారు అంటున్నారు. ఈ కారణంగా ఈశ్వరయ్య గిరిజన కాలనీలో తాగునీటి సమస్య అలాగే ఉండిపోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా అత్తి వరదరాజస్వామి విగ్రహ స్థాపన పూజలు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన వరదరాజస్వామి ఆలయంలో గురువారం ఆగమోక్తంగా అత్తివరదరాజస్వామి విగ్రహ స్థాపన పూజలు నిర్వహించారు. అందులో స్వామివారికి పూజలు నిర్వహించారు. అదే విధంగా అగ్నిప్రణయనం, హహాశాంతి అభిషేకం పూజలు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ అదికారులు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం ఉదయం అగ్ని ప్రణయనం, కుంభారాధన, సర్వగాయత్రి హెూమం జరగనుంది.

రేణిగుంట రైల్వే యార్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విశాలాంధ్ర - రేణిగుంట : రేణిగుంట రైల్వే స్టేషన్ యార్డులో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పోలీసులు కనుగొన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అప్ లైన్‌లోని కిలోమీటర్ నంబర్ 133/11-13 వద్ద ఈ మృతదేహం కనిపించింది. పోలీసుల వివరాల ప్రకారం, మృతుడు సుమారు 60 సంవత్సరాల వయసు గల పురుషుడు. ఆయన తెలుపు రంగు గల ఎరుపు, నీలం చెక్స్‌తో ఉన్న పూర్తి చేతుల చొక్కా, అలాగే నీలం మరియు కాఫీ రంగుల లుంగీ ధరించి ఉన్నారు. మృతదేహం నడుము వద్ద విడిపోయిన స్థితిలో ఉండటంతో ఘటనపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మృతుడి అచూకీ తెలిసిన వారు లేదా సంబంధిత సమాచారమున్న వారు రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. వివరాల కోసం 9885961430 (సబ్ ఇన్స్పెక్టర్) లేదా 9440 627665 (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ రైల్వే పోలీస్) నంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

తుఫాన్ సమయంలో అధికారుల పనితీరుకు..

హృదయపూర్వక అభినందనలు కృతజ్ఞతలు: ఎంఎల్ఏ



విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి నియోజకవర్గంలో ఇటీవల తుఫాన్ ప్రభావంతో పలు గ్రామాల ప్రజలు తీవ్రమైన వర్షాలు, గాలివానలతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే, తుఫాన్ ప్రభా వాన్ని ముందుగానే అంచనా వేసి, గ్రామాల వారీగా ప్రమాద ప్రాం తాలను గుర్తించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం, సహాయక బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా అధికారులు సమర్థవంతంగా వ్యవహరించారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా గాలివానల నడుమ కూడా విధుల్లో నిబద్ధతతో పని చేసిన అధికా రుల తీరు నిజంగా ప్రశంసనీయం. ప్రజల ప్రాణనష్టం జరగకుండా, ఆస్తి నష్టం తగ్గించే దిశగా వేగంగా చర్యలు తీసుకు న్నారు. క్షేత్రస్థా యిలో పహారా కాస్తూ, ప్రజలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించిన అధికారుల సేవాభావం ప్రభుత్వ పరిపాలనకు ఆద ర్శంగా నిలిచి ంది. తుఫాన్ సమయంలో సహకరించిన పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. తుఫాన్ ప్రభావంతో చంద్రగిరి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో, క్షేత్రస్థాయి పరిస్థితులను సోషల్ మీడియా ద్వారా, ఫోన్ ద్వారా పాత్రికేయ మిత్రులు ఎప్పటికప్పుడు తెలి య జేశారు. పాత్రికేయులు ప్రజల సమస్య లను వేగంగా పంచుకోవడం ద్వారా అధికా రులతో సమన్వయం చేసుకొని తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లభించింది. మీరు అందించిన విలు వైన సమాచారంతో పెద్ద ప్రమాదాలను అరికట్ట గలిగాము. ఇటువంటి సంక్షోభ సమయంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించిన పాత్రికేయ మిత్రుల సేవ నిజంగా ప్రశంసనీయం. నియోజకవర్గ అభివృద్ధి దిశగా కూడా ఇదేవిధంగా సహకారం కొనసాగించాలని మనస్ఫూ ర్తిగా కోరుకుంటు న్నాను. ప్రజల రక్షణ కోసం పగలు, రాత్రి తేడా లేకుండా కృషి చేసిన ప్రతి అధికారులు, సిబ్బంది మరియు పాత్రి కేయ మిత్రులకు పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నవంబర్ 3న సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం మండలం సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆత్మీయ సమావేశం నవంబర్ మూడవ తేదీన నిర్వహిస్తున్నట్టు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పద్మనాభరాజు పేర్కొన్నారు. నవంబర్ 3వ తేదీన సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12:00 వరకు ధర్మకర్తల మండలి సభ్యుల ఆత్మీయ సమావేశం జరగనుంది.సమావేశానికి నియోజకవర్గ టిడిపి కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. దీంతోపాటు జిల్లాకు చెందిన టిడిపి ప్రముఖులు,నియోజకవర్గంలోని టిడిపి మండల అధ్యక్షులు,ద్వితీయ శ్రేణి నాయకులు,పార్టీ శ్రేయోభిలాషులు హాజరవుతారని సమాచారం.ఈ నేపథ్యంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పద్మనాభరాజు నవంబర్ మూడో తేదీన ఉదయం ఎనిమిది గంటలకు పిచ్చాటూరు నుంచి పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులతో కలిసి ర్యాలీగా బయలుదేరి వయా నాగలాపురం మీదుగా సురుటుపల్లి ఆలయానికి చేరుకో నున్నారు.అనంతరం నియోజవర్గ టిడిపి కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి అధ్యక్షతన ధర్మకర్తల మండల సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు.ఈ సమావేశంలోనే సురుటుపల్లి ఆలయ అభివృద్ధికి సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిసింది.

బాధితులకు నష్టపరిహారంపై ఎమ్మెల్యే ఆరా

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: మొంథాతుపాన్ కారణంగా బాధితులకు నష్టపరిహారం అందిందా లేదా అనే విషయంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి గురువారం ఆరా తీశారు. అందులో భాగంగా టీడీపీ నాయకులు భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం తరపున అధికా రులు సకాలంలో స్పందించారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడి కూలిన ఇళ్లకు త్వరగా ఆర్థిక సాయం అందేలా చేయాలని బాధితులు వారి దృష్టికి తీసుకువచ్చారు. కాగా కోర్టు ప్రహారీ గోడ కూలే దశలో ఉందని ఈ సందర్భంగా ఎలాంటి ప్రాణనష్టం, ఆర్థిక నష్టం జరగకుండా ఎమ్మెల్యే చొరవచూపాలని వారి వివరిం చారు. స్పందించిన టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, నాయకులు బాలు, ఢిల్లీ, రాకేష్, నవీన్, వివేక్, తుమ్మ బాల తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రానికి ఒక వరం

– నిత్యవసర వస్తువులు పంపిణీలో కూరపాటి శంకర్ రెడ్డి

విశాలాంధ్ర - సత్యవేడు: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఒక వర మని తిరుపతి జిల్లా సత్యవేడు నియోజ కవర్గ టిడిపి కార్యక్రమాల సమన్వయకర్త కూరపాటి శంకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని రాజగోపాలపురం పంచాయతీ బాలగోపాలపురంలో పలువురు వరద బాధిత ఎస్టిలకు నిత్యాసర వస్తువుల పంపిణీ కార్యక్రమం జరిగింది.ముఖ్య అతి థులుగా జడ్పిటిసి విజయలక్ష్మి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ పద్మనాభ రాజు,పిచ్చాటూరు సతీష్ నాయుడు తదితరులు హాజర య్యారు.ఈ సందర్భంగా కూరపాటి శంకర్ రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ వంటి విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని ఆస్తి,ప్రాణ నష్టం చోటు చేసుకోకుండా ముందుచూపుతో వ్యవహరించే ఏకైక ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అన్నారు.తాను స్థానికంగా ఇక్కడే పుట్టడం వల్ల ఈ ప్రాంత సమస్యలను పరిష్కరిం చడానికి సిద్ధంగా ఉన్నాను అన్నారు. అయితే ఇక్కడ ఉన్న స్థానిక నేతలు తాగునీరు, రోడ్లు,అంగన్వాడి కేంద్రాలు ,గృహాలు,ఇంటి స్థలాలు వంటి సమస్యలపై తగిన ప్రతిపా దనలు ఇచ్చినట్లుం ఐతే నెల రోజుల్లోపు తప్పకుండా పరిష్కరి స్తానని ఆయన హామీ ఇచ్చారు. తదనం తరం కూరపాటి శంకర్ రెడ్డి,జడ్పిటిసి విజయలక్ష్మి తదితర టిడిపి నాయకులతో కలిసి పలువురు వరద బాధితులకు ఒక బస్తా బియ్యం,కూరగాయలు,వెయ్యి రూపాయలు నగదు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచులు రవి రెడ్డి,గోవిం దస్వామి, రూబెన్,టిడిపి నాయకులు శివకుమార్ నాయుడు బాలరాజు ,దాமురాజు,మురళి(చికెన్ చిన్న),లాంకో వాసు,ధనశేఖర్, జడేరు బాబు,మునివేలు, మాస్టర్ స్కూలు శ్రీనివాసులు రెడ్డి,రాధాకృష్ణ,వినాయకం, శివయ్య,జనసేన నాయకులు రూపేష్ కుమార్,బాల మురళీకృష్ణ,రేషన్ డీలర్స్ సంఘం అధ్యక్షులు సునీల్ జైన్,పలువురు వరద బాధితులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను అన్నీ విధాలుగా ఆదుకుంటాం

విశాలాంధ్ర- సత్యవేడు:వరద బాధితులను అన్నీ విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్పష్టం చేశారు.గురువారం సత్యవేడు మండలం దాసుకుప్పంలో పలువురు వరద బాధితులకు ప్రభుత్వ సాయం రూ.1000లు,25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సాయం అందుకున్న వారంతా ఎస్టీ కుటుంబాలకు చెందిన వారని,వారి ఇళ్లలోని నీరు చేరడంతో ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.ఈ కార్యక్రమంలో పిచ్చాటూరు టిడిపి నాయకులు ఇళంగోవన్ రెడ్డి, అధికారులు,కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సొంత ఆదాయ వనరులతో పంచాయతీ అభివృద్ధి

- ఎంపీడీవో వెంకటరత్నమ్మ

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : సొంత ఆదాయం వనరులతో పంచాయతీ అభివృద్ధి చెందేందుకు దృష్టి సారించాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గురువారం సొంత ఆదాయ వనరులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు కోసం ఎదురు చూడకుండా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గ్రామంలోనే సొంత ఆదాయ నిధులను సేకరించి అభివృద్ధి పరుచుకొనుటకు దృష్టి సారించాలన్నారు. గ్రామాభివృద్ధిలో భాగంగా వసూలు చేసే ఇంటి పన్ను, నీటి పన్ను,వినోదం పన్ను ప్రకటన పన్ను, వాహన పన్ను, మొబైల్ టవర్, దుకాణాల పన్ను, వచ్చే ఆదాయము ద్వారా పంచాయతుల సొంతంగా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వచ్చే ఆదాయాన్ని ఖర్చు చేయడంలోనూ జాగ్రత్తగా గ్రామాభివృద్ధి చేసుకోవాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పంచాయతీ అభివృద్ధి అధికారులు డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు. ఈ శిక్షణ తరగతులు నిర్వహించిన రిసోర్స్ పర్సన్స్ చిరంజీవి, హేమంత్, లు వివరించారు.

దయనీయ స్థితిలో ముక్కోటి ఆలయ రహదారి

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీ చంద్రగిరి - తిరుపతి రహదారిలో గల శ్రీ ఆనందపల్లి సమేత అగస్తేశ్వర స్వామి వారి శ్రీ రుద్ర పాదాల ముక్కోటి దేవాలయ రహదారి దయనీయ స్థితిలో ఉంది. ప్రతిరోజు ప్రత్యేకించి కార్తీక మాసంలో ఈ ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడుతోంది. ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో వేలాది మంది భక్తులు ఆలయ దర్శనం కోసం తరలివస్తున్నారు. అయితే, తిరుపతి - చంద్రగిరి ప్రధాన రహదారి నుండి ఆలయానికి వెళ్లే మార్గం దయనీయ స్థితిలో ఉంది. గతంలో వరదల ప్రభావంతో పేరూరు చెరువుకు వెళుతున్న వరద నీటిని దారి మళ్లించేందుకు సిమెంట్ రోడ్ ను తొలగించి అధికారులు పైపులు అమర్చి తాత్కాలిక మరమ్మత్తులు మాత్రమే చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఎటువంటి స్థిరమైన మరమ్మత్తులు చేపట్టకపోవడంతో భక్తులు, స్థానికులు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తూ పడిపోతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం రోడ్డు పునర్నిర్మాణం చేసి సిమెంట్ రోడ్ వేయాలని అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

తుఫాను కారణంగా రోడ్లపై పడి ఉన్న చెట్లు తొలగింపు

విశాలాంధ్ర - వెంకటగిరి: వైయస్సార్సీపీ వెంకటగిరి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదేశాలమేరకు 8వ వార్డ్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు ప్రజల ఇబ్బందులు సమస్యలను వెళ్లి తెలుసుకుని అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కరించమని ఆదేశించడంతో వైస్ చైర్మన్ శాతరాసి బాలయ్య మరాఠపల్లిలో ఇటీవల వర్షాలకు చెట్లు విరిగి దారులు మూతలుపడిపోయి రోడ్లు బురదమయం అయిపోయిన పరిస్థితులను మున్సిపల్ కమిషనర్‌కి వివరించి రోడ్లుకు అడ్డంగా వున్న చెట్లనుతో తొలగించి రోడ్లను సరిచేయించారు. అలాగే వీధి లైట్స్ ఎక్కడెక్కడ వెలగట్లేదో చెక్ చేసి వాటిని వెంటనే బిగించేవిధంగా అధికారులుతో మాట్లాడటం జరిగింది.

వితంతువులకు పెన్షన్లు మంజూరు చేయండి

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరం నందు గురువారం రోజున మున్సిపల్ చైర్మన్ అలీమ్ భాష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలను సమావేశం దృష్టికి మున్సిపల్ అధికారులు తెలియజేయడం జరిగింది. అజెండాలో ఉన్న అన్ని అంశాలను ఆమోదిస్తున్నామని కౌన్సిలర్ అమ్ము పేర్కొనడం జరిగింది .అదేవిధంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు సంబంధించిన సుమారు 45 మంది పెన్షన్లను మా వార్డు నందు తొలగించడం జరిగిందన్నారు. అంతేగాక వితంతువులు పెన్షన్లు ప్రభుత్వ ఏర్పడి రెండు సంవత్సరాలుగా వస్తున్న ఏ ఒక్కరికి మంజూరు చేయలేదని వాటిని వెంటనే మంజూరు చేయాలని సభ దృష్టికి తేవడం జరిగింది. దీనిపై స్పందించిన మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఏ ఒక్కరు పెన్షన్ తొలగించ లేదన్నారు .గతంలో వస్తున్న విధంగానే అన్ని పెన్షన్లు యధావిధిగా కొనసాగించామన్నారు. అయితే కొంత మందికి నోటీసులు ఇవ్వడం జరిగిందని వాటిని పరిశీలించి అర్హత లేని వారం దరినీ ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలగించడం జరుగుతుందన్నారు .వితంతువుల కొత్త పెన్షన్లు సంబంధించి ప్రభుత్వం ఆదేశించిన అనంతరం వారం దరికీ ఫంక్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ లో లలిత కుమారి నాగేంద్ర కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేలకొరిగిన వరి పంట

విశాలాంధ్ర - కార్వేటినగరం : గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి చేతికి అందే సమయంలో వరి పంట పూర్తిగా నేలకు వాలిపోయిందని, దాదాపుగా రెండు ఎకరాల వరి పంట పండించిన రైతు గుణశేఖర్ తెలిపారు. వర్షానికి నేలకు పడిపోవడంతో దిక్కు తోచని స్థితి ఏర్పడింది. సుమారు 90వేలు రూపాయలు చేతి కందే సమయంలో ఇలా జరగడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని కేఎం పురం గ్రామంలో ఈ దుస్థితి ఏర్పడింది. తక్షణమే ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు. సంబం ధిత అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి జిల్లా అధికారులకు పంపి న్యాయం చేయవల సిం దిగా అధికారులను రైతు కుటుంబం కోరుతున్నారు.

మంత్రి మధుకర్‌జికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - గూడూరు: మంత్రి మధుకర్ జీ సింహపురి ఎక్స్ ప్రెస్ లో గూడూరు కు విచ్చేశారు. ఆయనకు గూడూరు రైల్వే స్టేషన్ లో గూడూరు నియోజక వర్గ, అర్బన్ మండల బీజేపీ నాయకులు, శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మధుకర్ జీ మాట్లాడుతూ తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలో ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేర్చి భారతీయ జనతా పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు ,నాయకులు కృషి చేయాలన్నారు.మధుకర్ జీ కలిసిన వారిలో తిరుపతి జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆరికట్ల బాలకృష్ణ నాయుడు, గూడూరు టౌన్ అధ్యక్షులు కే దయాకర్, ఉపాధ్యక్షులు.. ఐ సురేష్ బాబు, గుమ్మడి శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు.. ఎం రవీంద్రబాబు, వీరి బోయిన వెంకటేష్ యాదవ్, నియోజకవర్గ కో కన్వీనర్.. కే నరేంద్ర, నగర ఓబీసీ అధ్యక్షులు.. కటకాలు సురేష్, నగర యువ మోర్చా అధ్యక్షులు, సిహెచ్ శివ, బిజెపి సీనియర్ నాయకులు.. మధిర సునీల్ కుమార్, రావుల శ్రీనివాస్ గౌడ్, కే చెంచు రెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరంలోని కే ఎం పురం పంచాయతీ ప్రాథమిక పాఠశాలకు కూత వేటు దూరంలో చెరువును తలపించే విధంగా నీళ్లు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే కాకుండా పక్కనే స్కూలు ఉండడంతో విద్యార్థులకు విష జ్వరాలు వచ్చే ప్రమాదాలు ఉన్నాయని ఎవరు పట్టించుకోవడంలేదని కొన్ని సంవత్సరాలుగా ఇలానే ఉన్న సంబంధిత అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు తెలిపారు. నీళ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వల్ల దోమలు, క్రిములు అధికంగా ఉన్నాయని, విద్యార్థుల స్కూళ్ళకి వెళ్లాలన్న ఆ నీళ్లలోనే వెళ్లాలని ఆవేదన వ్యక్తపరిచారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ఇలాంటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమష్టిగా మండల అభివృద్ధికి కృషి చేద్దాం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పిచ్చాటూరు: తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండలంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టి గా మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. గురువారం ఉదయం పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా మండలంలోని పంచాయితీలకు రూ.20 లక్షలు చొప్పున మంజూరైన నిధులు, చేపట్టదలచిన పనులు వివరాలను ఎంపీడీఓ మహమ్మద్ రఫీ ద్వారా ఆరా తీశారు. ప్రస్తుతం నిధులు విడుదలైన వేలూరు, నీరువాయి పంచాయతీలలో త్వరిత గతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల స్మశానాలలో నిర్మించిన, నిర్మించనున్న బోర్ల వివరాలను ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ఎమ్మెల్యే ఆరా తీశారు.అనంతరం ఎస్ ఎస్ బి పేటలో పేదలకు అందించనున్న భూమి పట్టా జాబితా పై తహశీల్దారు సుబ్రమణ్యం ద్వారా ఆరా తీశారు. వీటితో పాటు మండలంలోని ఇల్లు లేని లబ్ధిదారులకు వెంటనే ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని తహసీల్దారుకు ఎమ్మెల్యే సూచించారు. మండలంలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రధానంగా వర్షాలు పడి

నిలిచినందున గ్రామాల్లో పారిశుధ్యం పై దృష్టి సారించాలని, లేదంటే దోమలు పెరిగి అంటు వ్యాధులు, విష జ్వరాలు వ్యాపించే అవకాశం ఉందని ఎమ్మెల్యే వివరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు తహసిల్దారు టీవీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో మహమ్మద్ రఫీ, ఎస్సై వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు మాజీ క్లస్టర్ ఇన్చార్జి ఇళంగోవన్ రెడ్డి, పద్దు రాజు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రం పై పట్టు సాధించాలి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: అన్ని శాస్త్రాలతో సంబంధం ఉన్న భౌతిక శాస్త్రంపై విద్యార్థులు పట్టు సాధించాలని రెండోవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం వివరించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం పరిశీలించారు. భౌతిక శాస్త్రం పై విద్యార్థులు చదువుతుండగా విద్యార్థులతో ఎంఈఓ ముఖాముఖిగా మాట్లాడుతూ భౌతిక శాస్త్రంపై పట్టు సాధించడానికి, ప్రాథమిక సూత్రాలను అర్థం చేసుకోవడం, వాటిపై ఆధారపడి ఉన్న సమస్యలను ఎక్కువగా సాధన చేయడం, బొమ్మలు మరియు పటాలను బాగా గీయడం, ప్రయోగాలు చేయడం చాలా ముఖ్యమన్నారు. బొమ్మలు చక్కగా గీయడం, వాటిలోని భాగాలను గుర్తించడం ద్వారా పూర్తి మార్కులు పొందవచ్చునన్నారు. పదవ తరగతి విద్యార్థులు శ్రమించి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ ప్రధానోపాధ్యాయుడు ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు పూడి ధనంజయ, ఫిజిక్స్ ఉపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

విశాలాంధ్ర-గూడూరు: రక్తదానం సామాజిక బాధ్యత అని గూడూరు డీఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోనీ గూడూరు డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు, పలువురు యువత స్వచ్ఛందంగా రక్తదానం చేశారు..వారికి బ్లడ్ డోనర్ సర్టిఫికేట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని కాపాడేందుకు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు రెండవ పట్టణ సీఐ శ్రీనివాస్, ఒకటో పట్టణ సీఐ శేఖర్ బాబు, గూడూరు రూరల్ ఎస్సై తిరుపతయ్య, రెండో పట్టణ ఎస్సై రాజు, పోలీసు సిబ్బంది, పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లు కూలిన బాధితురాలికి నిత్యావసర సరుకులు

విశాలాంధ్ర-గుడిపాల: గుడిపాల మండలం మండికృష్ణాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పెరుమాళ్లకుప్పం గ్రామంలో నివసిస్తున్న వృద్ధురాలు అలివేలు ఇంటి గోడలు వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా కూలిపోయాయి. ఇంటిలోని సామాన్లు కూడా దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశాల మేరకు గుడిపాల మండల తెదేపా నాయకులు, ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వృద్ధురాలిని పరామర్శించిన నేతలు, ఇల్లు కూలిన ఘటనపై ప్రభుత్వానికి నివేదిస్తామని, ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. తక్షణ సాయంగా బియ్యం, నిత్యావసర సరుకులను బాధితురాలికి అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్బానాయుడు, ఉపాధ్యక్షులు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాల సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ రవి నాయుడు, గోపి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణను అడ్డుకునేందుకే కోటి సంతకాలు

విశాలాంధ్ర-ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలు ప్రవేట్ పరం, వ్యతిరేకంగా కోటి సంతకాల కార్యక్రమం జరిగినది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ చేస్తున్న ప్రభుత్వ మెడికల్ కాలేజీలను అడ్డుకునేందుకే కోటి సంతకాల సేకరణ అని ఆయన తెలియజేశారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజా వైద్య రంగాన్ని సువర్ణ అధ్యాయంగా మారిస్తే, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజా ఆరోగ్య రంగాన్ని దెబ్బతిస్తూ, నాడు జగన్మోహన్ రెడ్డి ఏర్పాటుచేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజ్ లను ప్రైవేట్ చేస్తూ తన బినామీలకు కట్ట పెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆయన ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రజా వైద్యం ప్రజలకు హక్కు, ప్రజల ఆస్తులు ఎప్పటికీ ప్రజలకే చెందాలని ప్రజల సంపూర్ణ మద్దతు కోరుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఓజీలి తో పాటు నియోజకవర్గం లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని సంజీవయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి దేశ రెడ్డి మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ గడ్డం అరుణా రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పి మౌనిక రెడ్డి, కొండూరు వెంకట సుబ్బరాజు, కొండూరు ప్రభాకర్ రాజు, దిలీప్ కుమార్ రెడ్డి, కొండూరు దామోదర్ రాజు, అజంతుల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అరికట్టండి

సీనియర్ సివిల్ జెడ్ భారతి

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి భారతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. సమస్యలు ఉంటే వాటిని కోర్టు వరకు తీసుకుపోకుండా అక్కడికక్కడే పెద్ద మనుషుల ద్వారా పరిష్కారం పొందాలని పేర్కొన్నారు. కోరారు. కొన్ని తప్పుడు యాప్‌ల ద్వారా కొందరు డబ్బులు పోగొట్టుకుంటున్నారని యాప్లను ఉపయోగించేటప్పుడు సరైన అవగాహన పొందాలన్నారు. ప్రజలు ఏవైనా సలహాలు పొందాలనుకుంటే 15100 నంబర్కు ఫోన్ చేసి తగిన సూచనలు పొందవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకట నారాయణ, డిప్యూటీ తాసిల్దార్ మహేష్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఏఎస్ఐ మురళీ ప్రసాద్, ఏపిఎం ఫరీద్ మస్తాన్, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాసులు, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనురాధ తదితర మండల అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర-వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ 14వ వార్డు కౌన్సి లర్ ఆదిశంకరయ్య ఎలివేట్ చేసుకుంట మెడికల్ కాలేజీల ప్రవేటీకరణ వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగి నది. ఇందులో భాగంగా 14వ వార్డు ధర్మపురం, బొగ్గులమిట్ట నందు పర్యటించి ప్రజల దగ్గరనుండి సంతకాల సేకరణ మరియు ప్రజాభిప్రయ సేకరణ చేయడం జరిగినది. కూటమి ప్రభుత్వం వచ్చినతరువాత మెడికల్ కాలేజీలను ప్రవేటీకరణ చేస్తాం అని ప్రకటించారు. ఇది ప్రజలకు తీరని అన్యాయం చేసినట్టు, పేద విధ్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమే, ప్రజలకు అవసరమైన వైద్యం ప్రవేటీకరణ వలన ఖరీదుగా మారుతుంది. దివంగత నేత వై.ఎస్.రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టి విద్యారులకు ఫీజు రీఎంబెర్స్మెంట్ తో ఎంతో మంది పేద విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడింది. ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ఉండాలి అనేది మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ప్రణాళిక, దానివలన పేద విద్యార్థులకు ఖరీదైన వైద్య విద్యను చేరువచేయడం, ప్రజలకు వైద్యం ఉచితంగా అందిచడం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశయం.

కేకేసీ హోమియోపథిక్ మెడికల్ కాలేజీ విద్యార్థుల వృద్ధాశ్రమ సందర్శన

విశాలాంధ్ర-కార్వేటి నగరం: చిత్తూరు జిల్లా కర్వేటినగరంలోని కేకేసీ హోమియోపథిక్ మెడికల్ కాలేజీ, అధ్యక్షులు కె.కుప్పయ్య చెట్టి, ఉపాధ్యక్షులు కె.నరసింహరావు, ప్రిన్సిపాల్ డా. జి.సరవణన్ ఆధ్వర్యంలో, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ద్వారా విద్యా ఫీల్డ్ విజిట్ నిర్వహించబడింది.ఈ కార్యక్రమం అక్టోబర్ 30, 2025న రాస్ ఓల్డ్ ఏజ్ హోమ్, కర్వేటినగరంలో

జరిగింది. సుమారు 80 మంది ఫైనల్ ఇయర్ మెడికల్ విద్యార్థులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులు వృద్ధాశ్రమ నివాసులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితులు జీవన విధానం గురించి వివరాలు సేకరించారు. అలాగే వృద్ధుల బ్లడ్ ప్రెషర్ మరియు బ్లడ్ షుగర్ పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ, సామాజిక సేవా భావన, మరియు కమ్యూనిటీ హెల్త్‌పై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా కార్మికుల రక్షణ సంక్షేమం కోసం చట్టాన్ని చేయాలి

- బిజెఎంఎస్ జాతీయ అధ్యక్షులు శ్రీశాంత్ ప్రకాష్ జాతవ్

విశాలాంధ్ర-గూడూరు: దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్, టెలివిజన్, డిజిటల్ మీడియా రంగాల్లో పనిచేస్తున్న వారందరికీ ఉపాధి భద్రత, భద్రత, బీమా, పెన్షన్, న్యాయ మైన వేతనాలు అందేలా సమగ్ర చట్టాన్ని రూపొం దించాలని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ భారత ప్రభుత్వాన్ని కోరింది. ఈ సందర్భంగా బి. జె.ఎంఎస్ జాతీయ అధ్యక్షుడు శ్రీశాంత్ ప్రకాష్ జాతవ్ మాట్లాడుతూ జర్నలిస్టులు, కెమెరామెన్లు, సంపాదకులు, ఇతర మీడియా నిపుణులు ప్రజాస్వామ్యం యొక్క నాల్గవ స్తంభానికి వెన్నెముక అని తెలిపారు. అయినప్పటికీ వారి హక్కులు, ఉద్యోగ భద్రత లేదా సంక్షేమ ప్రయోజనాలను పరిరక్షించే నిర్దిష్ట చట్టపరమైన నిబంధనలు లేవు. జర్నలిస్ట్ లకు రక్షణ చట్టాన్ని కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి. జె. ఎం.ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నాలి మధుసూదన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చెయ్యండి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జెడ్పి సీఈఓ రవికుమార్ నాయుడు అన్నారు. గురువారం వెదురుకుప్పం ఎంపిడిఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పై అరా తీశారు. కొన్ని చోట్ల స్థానిక సర్పంచ్ లకు టిడిపి నాయకులు పనులు దక్కించుకోవడంలో గొడవలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎవరైనా ఇబ్బందులు ఉంటే మండల స్థాయిలో పరిష్కారం కాకపోతే జిల్లాలో తమను సంప్రదిం చాలని సూచించారు. స్థానికంగా అందరూ కలిసి గ్రామాలని అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఎంపిడిఓ పురుషోత్తం, ఏవో నాగమణి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ పై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-పుత్తూరు: సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, పుత్తూరులో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్-2025 లో భాగంగా "విజిలెన్స్ అవర్ షేర్డ్ రెస్పాన్సిబిలిటీ" అనే థీమ్‌పై విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంటీ కరప్షన్ బ్యూరో ఎసిబి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.వి. నరసింహారావు విజిలెన్స్ ప్రాముఖ్యతపై మాట్లాడారు. ఆయన విద్యార్థుల్లో నిష్పక్షపాత ధోరణి, నిజాయితీ, మరియు బాధ్యతా భావం పెంపొందించుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.మధు సభను ఉద్దేశించి మాట్లాడుతూ, విజిలెన్స్ అనేది ప్రతి పౌరుడి సామూహిక బాధ్యత అని, విద్యార్థులు సత్యనిష్ఠతో సమాజ అభివృద్ధికి కృషి చేయాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటి సంతకాల ఉద్యమాన్ని విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలోని జిలాని సర్కిల్ వద్ద వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన "రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పలమనేరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జ్ వెంకటే గౌడ, జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వైద్య వ్యవస్థను ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లనివ్వకూడదు. ప్రజా వైద్యాన్ని బలహీనపరచడం, ప్రైవేట్ కాపిటలిస్టుల చేతుల్లోకి నెట్టడం చంద్రబాబు లక్ష్యమని" వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు హేమంత్ కుమార్ రెడ్డి, మండి సుధా, మురళీకృష్ణ, కమల్ బాషా, హైదర్, ప్రహల్లాద, చెంగారెడ్డి, నరేష్ కుమార్, రవి, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-వెంకటగిరి: విలేకరుల సమావేశంలో వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వెల్లడి. ప్రస్తుతం జరుగుతున్న జిల్లాల మండలాల పునర్వ్యవస్థీకరణ శాస్త్రీయంగా జరగటంలేదని, ఎక్కడా ప్రజాభిప్రాయ సేకరణ జరిగినట్లు తన దృష్టికి రాలేదన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతున్నారని, గూడూరు డివిజన్లో ఉన్న వెంకటగిరి డక్కిలి బాలాయపల్లి మండలాలను శ్రీకాళహస్తి డివిజన్లో విలీనం చేస్తారన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో వెంకటగిరిని ప్రత్యేక రెవెన్యూ డివిజన్ గా చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఈ అంశాన్ని ప్రాధాన్యత అంశంగా తీసుకొని రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయిస్తే వెంకటగిరి అభివృద్ధికి సహకరించిన వారు అవుతారని సూచించారు వెంకటగిరి రెవెన్యూ డివిజన్ గా చేయడం వల్ల పాలనా సౌలభ్యం, ఈ ప్రాంత ప్రజల ప్రజాభీష్టం నెరవేర్చిన వారవుతారని, దీనిని గౌరవించి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసేందుకు స్థానిక ప్రజా ప్రతినిధి చొరవ చూపాలన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి

చిత్తూరు కమిషనర్ నరసింహ ప్రసాద్

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ఇంజనీరింగ్ పనులను తనిఖీ చేశారు. సంతపేటలో కాణిపాకం రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులు తనిఖీ చేశారు. బటర్ ఫ్లై లైట్లు ఏర్పాటును పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సంతపేటలో కాలువ పనులను పరిశీలించారు. కాలువ నిర్మాణానికి వీలుగా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. అనంతరం గాంధీ రోడ్డు రోడ్డు విస్తరణ పనులను తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫుట్ పాత్, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. నగరంలో ప్రస్తుతం జరుగుతున్న ఇంజనీరింగ్ పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని, కాంట్రాక్టర్లను సమన్వయం చేసుకొని పనులు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. కమిషనర్ వెంట ఎంఈ వెంకటరామి రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, వార్డు కార్యదర్శులు ఉన్నారు.

పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పలమనేరు: సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు గురువారం పలమనేరులోని ప్రభుత్వ ఆసుపత్రిని జూనియర్ సివిల్ న్యాయమూర్తి లిఖిత తనిఖీ చేశారు. అక్కడికి వస్తున్న రోగులకు సరైన వైద్యం అందిస్తున్నారా అని డాక్టర్స్‌ని అడిగి తెలుసుకున్నారు. అలాగే పరిశుభ్రతను పాటించాలని డాక్టర్లకు మరియు అక్కడ ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అక్కడ అందిస్తున్న సేవలు గురించి ఆరా తీశారు. ఇక్కడకు వచ్చు పేద మరియు వయోవృద్ధులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డాక్టర్లకు మరియు సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎల్.భాస్కర్, సీనియర్ న్యాయవాది అరిఫుల్లా ఖాన్, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మేక్ ఏథాన్ వర్క్‌షాప్‌లో సిద్ధార్థ విద్యార్థులకు ద్వితీయ బహుమతి

విశాలాంధ్ర-పుత్తూరు: మదనపల్లెలో జరిగిన రెండు రోజుల మేక్ ఏథాన్ వర్క్‌షాప్, కంపిటీషన్లో పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. టైటాన్, ఇన్యునిటీ సంయుక్త ఆధ్వర్యంలో మిట్స్ మదనపల్లెలో నిర్వహించిన మేక్ ఫర్ మదనపల్లి కార్యక్రమంలో సిఎస్ఈ విభాగానికి చెందిన విద్యార్థులు కుమార్, మాధురి, ఉదయ్ కిరణ్ రెడ్డి, ఆదిల్ కలిసి రూపొందించిన "కైకో -కెన్" అనే వినూత్న ప్రాజెక్ట్ ద్వితీయ బహుమతిని సాధించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సిల్క్ వర్క్ కోకూన్ల లింగాన్ని ఆటోమేటిక్‌గా గుర్తించే సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయబడింది. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరమని నిర్వాహకులు పేర్కొన్నారు. న్యాయ నిర్ణేతలు ప్రాజెక్టును ప్రశంసించి రూ.7,000 నగదు బహుమతిని అందజేశారు. విజేతలను కళాశాల సిఎస్ఈ కోఆర్డినేటర్ రవి కుమార్, ఫ్యాకల్టీ సభ్యులు మనివాసగమ్, మురళి, ప్రిన్సిపాల్ మధు, జనార్ధన్ అభినందించారు.

అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: కూటమి ప్రభుత్వం రైతులకు గుర్తింపు కార్డు మంజూరు చేసింది. గుర్తింపు కార్డు అర్హత కలిగిన రైతులకు మాత్రమే ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం తెలిపారు. మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రం నందు గురువారం వ్యవసాయ శాఖ అధికారి షణ్ముగం ఆధ్వర్యంలో యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యూరియా కొరత ఉన్నందున దుర్వినియోగం కాకుండా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వ్యవసాయం కొనసాగిస్తున్న రైతులకు కౌలు రైతులకు, ఎరువుల పంపిణీ రైతులకు ఆధార్ అనుసంధానంతో గుర్తింపు కార్డు ఇటీవల అందించింది. ఈ గుర్తింపు కార్డు ఉన్న ప్రతి రైతుకు ఎకరాకు మూడు బస్తాలు చొప్పున మూడు పర్యాయాలు అందిస్తామన్నారు. ఆధార్ అనుసంధానంతో కూడిన కొత్త పంపిణీ విధానాన్ని అమలు చేయనుంది. ఈ-పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే యూరియా లభిస్తుంది. 14 రైతు సేవ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉన్నాయన్నారు. తద్వారా అవసరమైన వారికి సకాలంలో ఎరువులు అందించి, దుర్వినియోగాన్ని అరికట్టాలని ప్రభుత్వం లక్ష్యంగా అందిస్తున్నామన్నారు. రైతులు ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచిస్తున్నారు. గొడవలు చోటుచేసుకుండా ఉండేందుకు అధికారులు పంపిణీ చేస్తున్నారు.

తిరుపతిలో మెగా జాబ్ మేళా

విశాలాంధ్ర-తిరుపతి కలెక్టరేట్: తిరుపతి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా గురువారం జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ ఎస్డిసి), ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నవంబర్ 4 (మంగళవారం) ఉదయం 8 గంటల నుండి ఎస్వి సిసి డిగ్రీ కళాశాల, బాలాజీ కాలనీ, తిరుపతిలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం. శ్రీసిటీ, మేనకూరు సెజ్, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నై ప్రాంతాలకు చెందిన 18 బహుళజాతీయ కంపెనీలు పాల్గొని 860కి పైగా ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ లేదా పీజీ ఉత్తీర్ణత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ కోసం లింక్: https://naipunyam.ap.gov.in/user-registration రిజిస్ట్రేషన్ చివరి తేదీ నవంబర్ 3 అని, స్పాట్ రిజిస్ట్రేషన్ సదుపాయమూ కూడా ఉందని తెలిపారు. మరిన్ని వివరాలకు 8143576866,9988853335 ఫోన్ నంబర్లు ను సంప్రదించవచ్చని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆర్.లోకనాథం, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఏ.గణేష్, ఈఎస్సీ కోఆర్డినేటర్ కే.మహేష్ పాల్గొన్నారు.

పశువుల షెడ్ నిర్మాణాలు పూర్తి చేయండి

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పశువుల షెడ్ నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని డ్వామా పిడీ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం నల్ల వెంగణపల్లి, జక్కదన గ్రామ పంచాయితీ లలో నిర్మాణ దశలో ఉన్న పశువుల షెడ్ లు పరిశీలించి తగు సూచనలు చేశారు. పది రోజుల్లో పూర్తి చేయాలని ఆదిశగా మండల అధికారులు చొరవ చూపాలని అన్నారు. నిర్దేశించిన దశలవారి నిర్మాణం ప్రకారం బిల్లులు చెల్లింపుల కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్మాణం లో ఎటువంటి సందేహాలు వున్నా మండల అధికారులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మీనా కుమారి, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నో పార్కింగ్ ప్రదేశాలలో పోలీసుల ఫైన్

విశాలాంధ్ర-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి మండలంలో నో పార్కింగ్ ప్రదేశాలలో ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తూ వాహనాలను నిలిపినటువంటి వాహనదారులకు మండల పోలీసు వారు ఫైన్ విధించడం జరిగినది. చిత్తూరు జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ వారి ఆదేశాల మేరకు బైరెడ్డిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లి మండలంలోని అనేక ప్రదేశాలలో నోపార్కింగ్ (వాహనాలు నిలుపకూడని ప్రదేశాలలో) వాహనాలు నిలుపుకున్నటువంటి వాహనదారులకు ఫైన్ విధించడం జరిగినది. మునుపు అనేకసార్లు వీరికి చెప్పినాగాని నో పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు నిలపడం వల్ల, అదే విధంగా వాహనాలు నిలపడానికి కారణమైనటువంటి టీషాపులు, బడ్డీ షాపులు, తదితర షాపుల యజమానులకు కూడా ఫైన్లు వేయడం జరిగినది. ఇదే పరిణామం కొనసాగినట్లయితే కేసులు పెట్టి కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని, ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

సిపి బ్రౌన్ జయంతి నిర్వహణ పట్ల హర్షం

విశాలాంధ్ర-గంగవరం: తెలుగు సూర్యుడు సిపి బ్రౌన్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇవ్వడం పట్ల తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు పి. తులసినాథం నాయుడు పుష్ప హర్షం ప్రకటించారు. విదేశీయుడు అయినప్పటికీ తన జీతాన్ని, జీవితాన్ని తెలుగు భాషా సేవకే వెచ్చించిన సిపి బ్రౌన్ గురించి నేటి తరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం తెలుగు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేసి తెలుగు భాషా రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు.

కాగ్నిజెంట్‌కు మోహన్ బాబు విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-చంద్రగిరి: మోహన్ బాబు విశ్వవిద్యాలయం విద్యార్థులకు మరో గర్వకారణమైన విజయాన్ని అందించింది. మొత్తం 253 మంది విద్యార్థులు కాగ్నిజెంట్ టెక్నాలజీ సర్వీసెస్‌లో ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్స రానికి రు.4 లక్షల నుండి రూ.6.75 లక్షల వరకు జీత ప్యాకేజీ లభించింది. ఈ విషయాన్ని కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డా. కె.ఢిల్లీబాబు ప్రకటించారు. చాన్సలర్ డా. ఎం.మోహన్ బాబు, ప్రో-చాన్సలర్ విష్ణు వర్ధన్ బాబు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ చాన్సలర్ డా. నాగరాజ్ రామ్ రావు ఎంపికైన విద్యార్థులను హృదయపూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. సారది, ఫైనాన్స్ డైరెక్టర్ రవి శేఖర్ పాల్గొన్నారు.

స్మశాన వాటికకు స్థలం కేటాయించండి

విశాలాంధ్ర-పెద్దపంజాణి: దళితులకు స్మశాన వాటిక కు స్థలం కేటాయించాలని దళిత కాలనీవాసులు స్థానిక తహసి ల్దార్ హనుమంతుకు విన్న వించుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని దళితవాడలో పౌరువకుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ హనుమంతు మాట్లాడుతూ కులమత బేధాలు తగవని ప్రజలందరూ సమానమేనని అన్నారు. భారతదేశంలోని పౌరులందరికీ సమాన హక్కులు రాజ్యాంగం కల్పించిందని హక్కులకు భంగం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పుమని అన్నారు. సమాజంలో బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో అవగాహన అవసరమని అంగన్వాడీ ద్వారా బాలామృతం వంటి మొదలకు పౌష్టికాహారాలు పంపిణీ చేస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కల్పన సూచించారు. సమాజంలో వర్ణ వివక్ష అంటరానితనం నేరమని ఈ విధమైన చర్యలు పాల్పడితే వారిని కఠినంగా చట్టం ప్రకారం శిక్షించాల్సి వస్తుందని ఎస్ఐ మారప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిఎం నీరజ, గ్రామ రెవెన్యూ కార్యదర్శి సుజాత, పంచాయతీ కార్యదర్శి లత, సర్వేర్ వెంకటేష్ వైద్యశాఖ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సన్నిధిలో కేరళ హైకోర్టు న్యాయమూర్తి

విశాలాంధ్ర-పూతలపట్టు: స్వామివారిని కేరళ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ కృష్ణ నటరాజ్, కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకు న్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ సూపర్డెంట్ వాసు, ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది ఉన్నారు.

ముస్లిం యువత చూపు సాఫ్ట్‌వేర్ వైపు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: గతంలో ముస్లిం యువత విద్యకు దూరంగా ఉంటూ తల్లిదండ్రులకు భారంగా ఉండేవారు. కూటమి ప్రభు త్వం రావడంతో వారుచేస్తు న్న అభివృద్ధి కార్యక్రమా లకు ఆకర్షితులవుతున్నారు. అందులో భాగంగా విశాఖ పట్టణంలో ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేశారు. దీంతో ముస్లిం యువత భవిష్యత్తుపై ఆశలు పెంచుకు న్నారు. అందులో భాగంగా ఓ సాఫ్ట్‌వేర్‌ను క్రియేట్ చేశారు. దానిని గురువారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత సమయం వృదా చేయకుండా కొత్త కొత్త ఆవిష్కరణ లకు నాంది పలకాలని అందుకు కావాల్సిన సాయం తాను చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు హర్షం వ్యక్తం చేశారు.

వరసిద్ధి వినాయక స్వామి ఆన్లైన్ టెండర్లు, సివిల్ టెండర్లు

విశాలాంధ్ర-పూతలపట్టు: వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ఆస్థాన మండపం నందు గురువారం నిర్వహించిన ఆన్లైన్ టెండర్లు, సీల్డ్ టెండర్లు, బహిరంగ వేలాల ద్వారా వచ్చిన ఆదాయ వివరములు... పాలాభిషేకముకు పాలు విక్రయించుకుని లైసెన్స్ హక్కు (1 సంవత్సరం కాల పరిమితి) 9,31,000/- రూపాయలు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకుని లైసెన్స్ హక్కు (1 సంవత్సరం కాల పరిమితి) 69,00,309/- రూపాయలు, నేతి దీపాలు విక్రయించుకుని లైసెన్స్ హక్కు (1 సంవత్సరం కాల పరిమితి) 68,00,999/- 2026 సంవత్సరం క్యాలెండర్లు ముద్రించి విక్రయించుకుని లైసెన్స్ హక్కు (5 నెలల కాలపరిమితి) 38,00,000/- రూపాయలు, విగ్నేశ్వర కళ్యాణ మండపం దగ్గర బంకు నిర్వహించుకుని లైసెన్స్ హక్కు (1 సంవత్సరం కాలపరిమితి) 4,23,000/- శివాలయం ముందర బంకు నిర్వహించుకుని లైసెన్స్ హక్కు (1 సంవత్సరం కాల పరిమితి) 9,10,000/- రూపాయలు టెండర్ల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయం - 1,97,65,308/- రూపాయలు, ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్, ఏఈఓ లు ప్రసాద్, రవీంద్రబాబు, ఎస్ వి కృష్ణారెడ్డి, సూపర్డెంట్ బాల రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌బాబును కలిసిన కోలా విశాలాక్షి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రముఖ సినీనటులు మంచు మోహన్ బాబును గురువారం ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యురాలు కోలా విశాలాక్షి కలిశారు. ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్సు కోసం ఆయన శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భం గా ఆయనను కలిశారు. ఆయన బోర్డు సభ్యురాలిగా నియమితులైన కోలా విశాలాక్షిని దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

తిరుపతి జిల్లాలో నగరి రెవెన్యూ డివిజన్

నగరి ప్రజల ఆశయాలు నెరవేర్చిన ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

విశాలాంధ్ర-పుత్తూరు: నగరి సరిహద్దుల్లో మార్పులు, చేర్పులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. చిత్తూరు జిల్లాలోని నగరి రెవెన్యూ డివిజన్‌ను తిరుపతి జిల్లాలో కలపాలని సిఫార్సు చేశారు.గత వైసీపీ ప్రభుత్వం నగరి నియోజకవర్గం ను 2 గా విభజించి నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు జిల్లాలో కలిపి ఇక్కడి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసింది.ఈ మండలాల ప్రజల ఆకాంక్ష ను నగరి తెలుగుదేశం పార్టీ ఇంచార్జి హోదాలో ఉన్న గాలి భాను ప్రకాష్ నగరి కు వచ్చిన నారా చంద్రబాబు నాయుడు నారా లోకేష్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం లోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి వర్గం దృష్టికి తీసుకెళ్లారు. చిత్తూరు జిల్లాలోని నగరి రెవెన్యూ డివిజన్‌ను తిరుపతి జిల్లాలో కలపాలని మంత్రివర్గం సిఫార్సు చేసింది.

ఏకతా దివస్ సందర్భంగా పుత్తూరులో 2 కిలోమీటర్ల నడక

విశాలాంధ్ర-పుత్తూరు: ఏకతా దివస్ సందర్భంగా పుత్తూరులో (31.10.2025) శుక్ర వారం ఉదయం 7.00 గంటలకు అంబేద్కర్ సర్కిల్ నుండి ఆర్‌డీఎం గేట్ వరకు 2 కిలోమీటర్ల నడక కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమాన్ని పుత్తూరు పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సమాజంలో ఐక్యత, జాతీయ సమగ్రతకు ప్రతీకగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లుపుత్తూరు పోలీస్ అధికారులు తెలిపారు.

అదుపుతప్పి డివైడరును ఢీకొన్న కారు...

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం పూతలపట్టు మండలం ఎల్లంపల్లి గ్రామం వద్ద అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టిన కారు ఇద్దరికీ తీవ్ర గాయాలు పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిఎల్లంపల్లి గ్రామంసమీపంలోని శరవనాభవ హోటల్ వద్ద గురువారం సాయంత్రం మూడున్నర గంటల ప్రాంతంలో తిరుపతి వైపు వెళ్తున్న కారు అతివేగం కారణంగా అదుపుతప్పి ఓ వైపు డికొని మరో వైపు దూసుకెళ్లి డివైడర్ను ఢీ కొట్టి కారు నుజ్జునుజ్జయింది ఇందులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ గాయాలు కావడంతో స్థానికుల సమాచారంతో పూతలపట్టు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఇరువురిని చిత్తూరుప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ ఘటనపై పూతలపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుత్తూరు మున్సిపల్ అత్యవసర సమావేశం

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మున్సిపల్ అత్యవసర సమావేశం కౌన్సిల్ హాల్ లో శుక్రవారం మున్సిపల్ చైర్ పర్సన్ అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

మనవాలిలో పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-ఓజిలి: మండలంలోని మనవాలి గ్రామం సర్పంచ్ ముసులూరు వీరమ్మ ఆధ్వర్యంలో మొంథా తుఫాన్ కారణంగా వీధులలో పేరుకుపోయిన చెత్తను తొలగించి పారిశుద్ధ్యం పనులను చేపట్టడం జరిగినది. వీధులలో బ్లీచింగ్ మరియు వైట్ వాష్ వేయడం జరిగినది.

ఆలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ

విశాలాంధ్ర-గంగవరం: మండలంలోని, సాయి గార్డెన్ సిటీలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో, నూతనంగా ప్రతిష్ఠించ నున్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి మరియు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు నవంబర్ 1 నుండి నవంబర్ 3, 2025 వరకు అత్యంత వైభవంగా జరగనున్నాయని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. మూడు రోజుల పాటు జరిగే ఈ పుణ్యకార్యాలు వైదిక సంప్రదాయాల ప్రకారం యాగశాల కార్యక్రమాలు, హోమాలు, అర్చనలు, పూర్ణాహుతి వంటి ఘట్టాలతో నిర్వహించబడతాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ చారిత్రక ప్రతిష్ఠా మహోత్సవంలో సాయి గార్డెన్ సిటీ నివాసితులు మరియు సమీప ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, శ్రీ స్వామి వారి దివ్య ఆశీర్వాదాన్ని పొందాలని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుణశేఖరన్, లక్ష్మీ నారాయణ, మోహన్ రెడ్డి, దేవనాథ రెడ్డి, వెంకటేశు, శ్రీనివాసులు రెడ్డి, శ్రీకాంత్, దేవకుమార్, బైరాగి, తులసినాదం నాయుడు, రవిచంద్ర రెడ్డి, ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిచ్చి పదవులు పొందాల్సిన అవసరం మా కుటుంభానికి లేదు

విశాలాంధ్ర-కార్వేటినగరం: ఐదు దశాబ్దాల కాలంగా రాజకీయం చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తూ వస్తున్న శ్రీరాములు నాయుడు కుటుంబానికి డబ్బులిచ్చి పదవులు తెచ్చుకోవాల్సిన అవసరం లేదని ఎంపీపీ లతా బాలాజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తమ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ గత మూడు రోజుల క్రితం పాలసముద్రం మండలం ఎంపీపీ శ్యామల, శివప్రకాష్ రాజు తమ కుమార్తెకు జరిగిన వివాహ సందర్భంగా ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరైతే అక్కడ ఎలాంటి రాజకీ చర్చలు లేక పోయినా కొన్ని పత్రికలు రాజకీయ రంగులు పులిమి ఎంపీపీ కుటుంబం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి కుటుంబానికి వ్యతిరేఖంగా పని చేస్తున్నారని. డబ్బులిచ్చి ఎంపీపీ పదవులు పొందారని, అలాగే మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి లక్షల రూపాయలు తీసుకుని పదవులు ఇచ్చారని అసత్య కథనాలు అల్లడం సమంజనం కాదన్నారు. డబ్బులిచ్చి పదవులు పొందాల్సిన అవసరం' శ్రీరాములు నాయుడు కుటుంబానికి లేదు, అదే విధంగా డబ్బులు తీసుకుని పదవులు ఇవ్వాల్సిన అవసరం కళత్తూరు నారాయణ స్వామి కుటుంబానికి లేదని అన్నారు. మండల కోప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి,జేసీఎస్ కన్వీనర్ పురంధర్ వైస్ సర్పంచ్ శేషాద్రి మాట్లాడుతూ బాలాజీ నాయుడు కుబుంబం నారాయణస్వామి కుటుంబానికి వ్యతిరేఖంగా పనిచేస్తున్నారని అసత్య కథనాలు చేపడ్డం మంచి పద్ధతి కాదన్నారు. తండ్రి చేసిన సేవలను గుర్తించి బాలాజీ నాయుడుకుటుంబ లో ఎంపీపీ పదవి ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు దేశమ్మ, మురగయ్య, సర్పంచ్ శీలారాణి, పవన్కుమార్, గోపి, రాజారెడ్డి, జేజేలురెడ్డి, మురగయ్య, విజయకుమార్. వరాలురెడ్డి, - ధనంజయులు ఆకుల గోపి. జేమ్స్ లోకనాధనాయుడు, పయణిరెడ్డి, చిరంజీవిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, గిరి, దాము, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాణిపాకం స్వామి సన్నిధిలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పూతలపట్టు: పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం, శ్రీ స్వామివారిని దర్శించుకున్న అనంతపురం అర్బన్ శాసనసభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసిన సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు ఉన్నారు.

గణపతి కాలనీలో అన్నదానం

విశాలాంధ్ర-తొట్టంబేడు: మండలంలోని గణపతి కాలనీలో గురువారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన పార్టీ నాయకులు ప్రతి గురువారం అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ కాలనీలో గిరిజనులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, చిరంజీవి, శ్రీనివాసులు, వెంకటేష్, ప్రదీప్, తేజ, మణి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటిని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేష్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ఎంపీ సీఎం రమేష్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి దంపతులు, పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేద పండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. వారితోపాటు ఎమ్మెల్సీ బీటెక్ రవి కూడా దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మహిళా నాయకురాలు కండ్రిగ ఉమా, పాలకమ oడలి సభ్యు లు, గుర్రప్పశెట్టి, గాదిపాకుల గోపి, కోలా విశాలాక్షి, చాగణం శైలజ టీడీపీ నాయ కులు చెంచయ్యనాయుడు, విజయ్ కుమార్ నాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి, నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీ రెడ్డి, వినయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సృజనాత్మకతకు వేదికగా అపోలో ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఎక్స్పో - 2025

విశాలాంధ్ర - చిత్తూరు: ది అపోలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన అపోలో ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ ఎక్స్పో 2025 విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, సాంకేతిక ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని యూనిర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పొతరాజు ప్రారంభించి, విద్యార్థుల ప్రాజెక్ట్ ప్రదర్శనలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ు "ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సాంకేతిక ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి. ది అపోలో యూనివర్సిటీ రీసర్చ్ మరియు ఇన్నోవేషన్‌లను మరింతగా ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశాం. త్వరలోనే ఇంక్యూబేషన్ సెంటర్ మరియు వర్క్‌స్టేషన్ ఏర్పాటు చేసి, విద్యార్థులను స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్ల దిశగా ప్రోత్సహిం చబోతున్నాం. అలాగే, విద్యార్థుల ప్రాజెక్టులను పేటెంట్ స్థాయికి తీసుకెళ్ళేందుకు విశ్వవిద్యాలయం కృషి చేస్తున్నది," అని ప్రొఫెసర్ పొతరాజు పేర్కొన్నారు. ఈ ఎక్స్పోలో విద్యార్థుల ప్రాజెక్టులు సృజనాత్మకత, సాంకేతిక ప్రతిభకు నిదర్శనంగా నిలిచి, సమాజానికి ఉపయోగపడే వినూత్న పరిష్కారాలను సూచిం చాయి. స్టూడెంట్స్ ఇష్యూ ట్రాకింగ్ ప్లాట్‌ఫాం, స్మార్ట్ హౌస్, మైన్ సేఫ్టీ హెల్మెట్, స్మార్ట్ హైడ్రా ఐఓటి సిస్టమ్, ఇరిగేషన్ మరియు లైటింగ్ సిస్టమ్‌లు, వాయిస్ కంట్రోల్డ్ రోబో, ఎమర్జెన్సీ లేన్ సిస్టమ్, ఏఐ ఆధారిత హాజరు మేనేజ్‌మెంట్ వంటి సాంకేతిక ఆవిష్కరణలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ ప్రాజెక్టులు విద్యార్థుల సృజనాత్మకతను, సాంకేతిక దృష్టిని ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో ఏఐఎంఎస్ఆర్ అసోసియేట్ డీన్ డా. రమ్యా రామకృష్ణన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డా. డి. జగదీశన్, స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొ. కె. భాస్కర్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. సేతురామ సుబ్బయ్య, నర్సింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జింటో మాథ్యూస్, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు డా. కె. తిరుమలేశు, డా. సి. పక్కిరయ్య, ఎన్. కీర్తి, ఎం. కమలహాసన్. అధిక సంఖ్య లో విద్యార్థులు,అధ్యాపకులు,పరిశోధకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అధిక వర్షాలకు వరి పంట నష్టం

జిల్లా వ్యవసాయ అధికారి పర్యటన

విశాలాంధ్ర - గుడిపాల : చిత్తూరు జిల్లాలో కురుస్తున్న వర్షాల ప్రభావాన్ని పరిశీలించేందుకు జిల్లా వ్యవసాయ అధికారి జే. మురళీకృష్ణ, సహాయ వ్యవసాయ సంచాలకులు డి. ఉమా, మండల వ్యవసాయ అధికారి ఎం సంగీతం తో కలిసి గుడిపాల మండలంలోని పేయనపల్లె, గుడిపాల గ్రామాల వరి, వేరుశెనగ పంట పొలాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అధిక వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించి రైతుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గుడిపాల మండలంలో వరి పంట కోత దశకు చేరుకుందని అధికారులు తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పనలు వర్షానికి తడిచినట్లయితే గింజలు మొలకెత్తకుండా 5% ఉప్పుద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలని సూచించారు. అలాగే గింజ రంగు మారకుండా ఉండేందుకు లీటరు నీటికి 1 గ్రాము కార్బెండిజం లేదా 2 గ్రాముల కార్బెండిజంంమాంకోజెబ్ లేదా 1 మి.లీ ప్రోపికొనజోల్ మందును పిచికారీ చేయాలని సూచించారు.

సప్తవర్ణ శోభితం శ్రీవారి పుష్పయాగం

తిరుమలలో వైభవంగా పుష్పాలు ఊరేగింపు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి ఆలయంలో కారీక్త మాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే పుష్పయాగానికి అవసరమైన పుష్పాల ఊరేగింపు గురువారం తిరుమలలో ఘనంగా జరిగింది. తిరుమలలోని కల్యాణ వేదిక వద్ద గల ఉద్యానవన విభాగంలో ముందుగా పుష్పాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఉద్యానవన సిబ్బంది, శ్రీవారి సేవకులు కలిసి పుష్పాలను ఊరేగింపుగా శ్రీవారి ఆలయం వరకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆలయం ముందు మీడియాతో మాట్లా డుతూ శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఏవైనా తెలియక దోషాలు జరిగి ఉంటే ఆ దోష నివారణకు బ్రహ్మోత్సవాల తర్వాత వచ్చే కార్తీక మాసంలో శ్రీవారి జన్మన క్షత్రమైన శ్రవణా నక్షత్రం రోజున పుష్పయాగం నిర్వ హించడం ఆనవాయితీ గా వస్తోందన్నారు. లోక కళ్యాణార్థం 15వ శతాబ్దం నుంచి పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ తరువాత నిలిచిపోయిన ఈ మహోత్సవాన్ని 1980 నుండి టీటీడీ పునరుద్ధరించి నిర్వహిస్తున్నదన్నారు. శ్రీవారి పుష్పయాగానికి బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించినట్లు తెలిపారు. శ్రీవారి ఆలయంలో గురువారం ఉదయం 9 నుండి 11 గంటల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారికి వేడుకగా స్నపన తిరుమంజనం జరిగిందని చెప్పారు. మధ్యా హ్నం 2 నుండి 5 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శోభాయ మానంగా పుష్పయాగం జరుగుతుం దన్నారు. ఇందుకోసం 16 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలను వినియోగిస్తామని చెప్పారు. తమిళనాడు నుంచి ఐదు టన్నులు, కర్ణాటక నుంచి రెండు టన్నులు, ఆంధ్రప్రదేశ్ నుండి రెండు టన్నులు కలిపి మొత్తం 9 టన్నుల పుష్పాలను దాతలు విరాళంగా అందించారని వెల్లడించారు.

తిరుమలలో వైభవంగా శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవ సంబరాలు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా గురువారం తిరుమలలోని ఆస్థాన మండపంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి ఆనంద తీర్థాచార్యులు స్వామివారి వైభవం, మెట్లోత్సవం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం నామ సంకీర్తన, సామూహిక భజన, హరిదాసులు అందించిన ఉపదేశాలు, సంగీత విభావరి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా శుక్రవారం ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం నుండి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ప్రారంభం కానుంది. భజన మండలి సభ్యులు సాంప్రదాయ భజన చేస్తూ తిరుమలకు చేరుకుంటారు.

గరుడ వారధిపై వేగ నియంత్రణ చర్యలు చేపట్టండి

- స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. మౌర్య

విశాలాంధ్ర - తిరుపతి : నగరంలోని గరుడవారధి పై వేగ నియంత్రణకు మరిన్ని అదనపు చర్యలు చేపట్టాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గరుడవారధి పై వాహనాల వేగ నియంత్రణ కొరకు స్మార్ట్ సిటీ, పోలీస్, ఇంజనీరింగ్ అధికారులతో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ గరుడవారధిపై ప్రమాదాలు జరగకుండా ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. వాహన చోదకుల్లో మరింత అవగాహన కలిగించేలా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా వేగాన్ని నియంత్రించే రబ్బర్ స్ట్రిప్స్, మలుపు తెలుపుతూ సూచిక బోర్డులు, బ్లింకర్స్, స్పీడ్ లిమిట్ బోర్డులు మరిన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే గరుడవారధి పైన, కింద ట్రాఫిక్ నియంత్రణ కొరకు చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ రవిమనోహర్ ఆచారి, డి.ఎస్.పి. లు రామకృష్ణ ఆచారి, భక్తవత్సలం, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. రవి, ఆఫ్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్పి

విశాలాంధ్ర - చిత్తూరు: పోలీస్ అమరవీరుల సంస్కరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోలీస్ సిబ్బందికి పోలీసు సిబ్బంది పిల్లలకు ఇటీవల వ్యాసరచన వకృత్వ పోటీలను నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు పోలీస్ సిబ్బందికి గురువారం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ జిల్లా పోలీస్ కార్యాలయంలో బహుమతులను అందజేసి విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.